ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5
శ్రీకాకుళం
జిల్లా వార్తలు
శుక్రవారం 22 నవంబరు 2024



రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపిక

శ్రీకాకుళం స్పోర్ట్స్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రిమ్స్‌లో మూడో సంవత్సరం ఎంబీబీఎస్ చదువుతున్న ఆర్‌వీ రమ్యశ్రీ జాతీయస్థాయి రోలర్ స్కేటింగ్ పోటీలకు ఎంపికయింది. ఈ నెల 11న విశాఖపట్నంలో నిర్వహించిన రా ష్ట్ర స్థాయి పోటీల్లో నైపుణ్యం ప్రదర్శించింది. ఆల్‌పిన్ విభాగంలో బంగారు పతకం, డౌన్‌హిల్ విభాగంలో రజిత పతకాన్ని సాధించింది. రమ్యశ్రీని రిమ్స్ ప్రిన్సిపాల్ రవివెంకటాచలం, స్పోర్ట్స్ కమిటీ అధ్యక్షుడు పి.పరశురాం, కార్యదర్శి ఎస్.నర సింహమూర్తి, ఫిజికల్ డైరెక్టర్ బి.గౌరినాయుడు తదితరులు అభినందించారు. జాతీయస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.



భోజనం చేస్తున్న విద్యార్థులు (ఫైల్)

ఆశ్రమ పాఠశాలలకు.. అక్షయపాత్ర

- గిరిజన విద్యార్థులకు రుచికరమైన భోజనం
- కూటమి ప్రభుత్వ నిర్ణయంపై హర్షం

మెళియాపుట్టి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి)

గిరిజన ఆశ్రమ పాఠశాల విద్యార్థులకు అక్షయపాత్ర ద్వారా ఆహారం అందించేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోంది. 'వసతిగృహాల్లో చదువుతున్న విద్యార్థులకు రక్తహీనత, ఇతర అనారోగ్య సమస్యలు రాకుండా చూసుకోవాలి. అనారోగ్యం కారణంగా ఏ ఒక్క విద్యార్థీ చదువుకు దూరం కాకూడదు. వారికి అక్షయపాత్ర ద్వారా నాణ్యమైన ఆహారం అందించాలి' అని సీఎం చంద్రబాబు ఇటీవల గిరిజన సంక్షేమశాఖ సమీక్ష లో అధికారులను ఆదేశించిన విషయం తెలిసిందే. ఈ మేర కు అధికారులు సన్నాహాలు చేస్తున్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల నిర్వహణను గత వైసీపీ ప్రభుత్వం గాలికొదిలే సింది. విద్యార్థుల సంక్షేమాన్ని విస్మరించింది. నిధుల కేటా యింపు, మౌలిక వసతుల కల్పన ఊసే మరిచింది. గత ప్రభుత్వ నిర్లక్ష్యం విద్యార్థులకు శాపంగా మారింది. వైసీపీ పాలనలో గిరిజన వసతిగృహాలతోపాటు గురుకులాల్లో.. ఆ పార్టీ నాయకులకు నచ్చిన వ్యక్తులకు టెండర్లు కట్టబెట్టారు. మరోవైపు అధికారుల పర్యవేక్షణ లేక వార్డెన్లు మెనూ అమ లు చేయని పరిస్థితి నెలకొంది. కొన్నాళ్ల కిందట మెళి యాపుట్టి మండలంలోని పెద్దమడి ఆశ్రమ పాఠశాలను ఐటీ డీఏ పీవో యశ్వంత్‌రెడ్డి తనిఖీ చేశారు. ఆ సందర్భంలో ఒక విద్యార్థిని మెనూ సక్రమంగా లేదని ఫిర్యాదు చేసింది. కాగా.. ఫిర్యాదు చేసిన కారణంగా ఆశ్రమ అక్కడి వార్డెన్ ఆ విద్యార్థినితో డైనింగ్ రూమ్ కడిగించారని తెలి సింది. దీంతో అప్పటి నుంచీ భోజనం ఎలా ఉన్నా.. విద్యార్థులు బయటకు చెప్పేందుకు భయపడుతు న్నారు. ఆ వార్డెన్‌కు కొంతమంది వైసీపీ నాయకుల అండ ఉండడంతో ఇష్టారాజ్యంగా వ్యహరిస్తు న్నారనే ఆరోపణలు ఉన్నాయి. ఇటువంటి పరిస్థితి లేకుండా కూటమి ప్రభుత్వం రుచికరమైన అక్షయ పాత్ర ద్వారా రుచికరమైన ఆహారం అంద జేసేందుకు చర్యలు చేపడుతోంది.

జిల్లాలో ఇదీ పరిస్థితి..

జిల్లాలో 12 గిరిజన వసతిగృహాల్లో 1,529 మంది విద్యార్థులు చదువుతున్నారు. 29 గిరిజన ఆశ్రమ పాఠశాల్లో 4,270మంది విద్యార్థులు ఉన్నారు. వీరికి కార్పొరేట్ తరహాలో చదువుతో పాటు భోజనం అందించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. గత ప్రభుత్వం 'నాడు-నేడు' పేరుతో పాఠశాలలకు నిధులు విడుదల చేసినా ప్రయోజనం కనిపించలేదు. అధికంగా వైసీపీ నాయకులు కూరగాయాలతో పాటు వంట సామగ్రి అందించేందుకు టెండర్లు దక్కించుకోవడంతో విద్యార్థులకు రుచికరమైన భోజనం దొరకలేదనే ఆరోపణలు ఉన్నాయి. మెనూపై విద్యార్థులు ఫిర్యాదు చేసినా పట్టించుకునేవారు కరువయ్యారు. దీంతో కొంతమంది విద్యార్థులు బడి మధ్యలో మానేసి.. ఇళ్లకు వెళ్లిపోయిన సంఘటనలు ఉన్నాయి. ఆశ్రమ వసతి గృహాల్లో మెనూ అమలు తీరుపై అధికారుల పర్యవేక్షణ కొరవడడంతో కొంతమంది వార్డెన్లు ఇష్టారాజ్యంగా వ్యవహరించారు. ఏడాదికి ఒకరు చొప్పున వార్డెన్‌గా వ్యవహరించాలి. కానీ వైసీపీ నేతల అండతో కొన్నిచోట్ల వార్డెన్లు రెండు, మూడేళ్లు ఒకే చోట కొనసాగ డం గమనార్హం. పెద్దమడి ఆశ్రమ పాఠశాలలో రెండేళ్లకుపైగా ఒకే వార్డెన్ కొనసాగడడంపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. అటువంటి పరిస్థితులు లేకుండా కూటమి ప్రభుత్వం చెక్ పెట్టాలనే ప్రయత్నం ఎంతవరకు ఫలిస్తుందో చూడాలి.

సురక్షిత నీరు.. వైద్యసేవలు అందక..

టీడీపీ ప్రభుత్వం 2016-17లో ఆశ్రమ పాఠశాలల్లో మినరల్ వాటర్ ప్లాంట్లు ఏర్పాటు చేయించింది. విద్యార్థులకు సురక్షిత నీటిని అందించింది. అయితే వైసీపీ ప్రభుత్వం అధికారం లోకి వచ్చిన తరువాత ఇవన్నీ మూలనపడిపోయాయి. కనీసం వాటి నిర్వహణకు నిధులు మంజూరు చేయలేదు. దీంతో గిరిజన విద్యార్థులు సురక్షిత నీటికి దూరమయ్యా రు. అలాగే టీడీపీ ప్రభుత్వ హయాంలో నియామక మైన ఏఎన్‌ఎంలను కూడా వైసీపీ ప్రభుత్వం తొల గించింది. సురక్షిత నీరు, సకాలంలో వైద్య సేవలు అందకపోవడం వంటి తదితర కారణాలతో ఐదేళ్ల లో ఎంతోమంది గిరిజన విద్యార్థులు మృత్యువాత పడ్డారు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారం లోకి రావడంతో గిరిజనుల్లో ఆశలు చిగురిస్తు న్నాయి. అక్షయపాత్ర ద్వారా ఆహారం అంద జేసేందుకు చర్యలు చేపడుతుండడంతో విద్యార్థులు, తల్లిదండ్రులు ఊరట చెందు తున్నారు. ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థుల ఆరోగ్య పరిస్థితిని ఎప్పటికప్పుడు పర్య వేక్షించేందుకు ఏఎన్‌ఎంలను నియమి స్తామని ఇటీవల మంత్రి సంధ్యారాణి కూడా ప్రకటించడంతో సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి. సచివాలయాల్లో పనిచేస్తున్న ఏఎన్‌ఎంలను త్వరగా ఆశ్రమ పాఠశాలలకు బదలాయించాలని గిరిజన సంఘాలు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు కోరుతున్నారు.



పెద్దమడి ఆశ్రమ పాఠశాల

ఉద్దానంలో.. ఎయిర్‌పోర్ట్?

- కేంద్ర బృందం స్థల పరిశీలన
- మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో 1,384 ఎకరాల సేకరణకు సన్నాహాలు



గంగువాడ వద్ద పోర్టు భూముల మ్యాప్‌ను పరిశీలిస్తున్న కేంద్ర బృందం సభ్యులు..

హరిపురం/వజ్రపుకొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఉద్దానంలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్టు నిర్మాణానికి సన్నాహాలు సాగుతున్నాయి. ఈ మేర కు గురువారం మందస, వజ్రపుకొత్తూరు మండ లాల పరిధిలోని ఐదు రెవెన్యూ గ్రామాల పరిధిలో భూములను కేంద్ర బృందం సభ్యులు పరిశీలించా రు. ఎయిర్‌పోర్ట్ అథారిటీ డీజీఎం పర్వీందర్ తెవా టియా ఆధ్వర్యంలో మాల్కీత్ సింగ్, కేపీ వెంకట రామన్, సునీల్‌కుమార్, షేక్ అబ్దులాజీస్ క్షేత్ర స్థాయిలో గ్రామాలను సందర్శించారు. మ్యాపింగ్‌తో పాటు సెల్‌టవర్లు, ఇతర ఎత్తైయిన కట్టడాలను క్షుణ్ణంగా పరిశీలించారు. ఎయిర్‌పోర్టుకు మొత్తం 1383.71 ఎకరాల విస్తీర్ణం అవసరం కాగా.. ఈ ప్రాంతంలో 295.12 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. దీంతో 1088.59 ఎకరాల జిరాయితీని రైతుల నుంచి సేకరించాల్సి ఉంది. ఒక్క బిడిమి గ్రామ రెవె న్యూ పరిధిలోనే 254.98 ఎకరాల ప్రభుత్వ భూమి ఉంది. ఈ మేరకు సర్వే చేసి భూ సేకరణ ప్రక్రియ ప్రారం భించాలని ఎయిర్ పోర్ట్ కేంద్ర బృందం సభ్యులు స్థానిక రెవెన్యూ అధికారులకు దిశానిర్దేశం చేశారు.



గంగువాడ వద్ద సేకరించాల్సిన భూముల్లో అధికారులు పాతిన జెండా

దశ, దిశ మారనున్న తీర ప్రాంతం

మందస, వజ్రపుకొత్తూరు మండలాల పరిధిలో గ్రీన్‌ఫీల్డ్ ఎయిర్‌పోర్ట్ నిర్మాణం పూర్తయితే జిల్లా లోని తీరప్రాంతం దశ, దిశ మారనుంది. ఈ ఎయి ర్‌పోర్టును సంతబొమ్మాళి మండలంలోని మూల పేట నౌకాశ్రయానికి అనుసంధానం చేయనున్నారు. దీంతో జిల్లాలోని తీర ప్రాంతం కోస్టల్ కారిడార్, ఇండస్ట్రీయల్ పార్కులు (మిగతా 6వ పేజీలో..)

సేకరించాల్సిన భూమి ఇలా..

రెవెన్యూగ్రామ పరిధి..	బిడిమి	లక్ష్మీపురం	బేతాళపురం	చీపురుపల్లి	మెట్టూరు
విస్తీర్ణం (ఎకరాల్లో) (ప్రభుత్వ భూమితో కలిపి)	929.61	24.45	94.87	127.57	207.21



మాట్లాడుతున్న కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

సమస్యలను పరిష్కరించాలి

- కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్

శ్రీకాకుళం కలెక్టరేట్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రెవె న్యూ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ తహసీల్దార్లను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రెవెన్యూ అధికారులతో ఆయన సమావేశమయ్యారు. పెండింగ్ సమస్యలు, లోకాయుక్త, కోర్టు కేసులు, నీటి పన్ను, నాలా, రీసర్వే, ఆర్‌ఓఆర్, సివి ల్ సప్లయిస్, తదితర అంశాలపై మండలాల వారీగా సమీక్షించారు. రెవెన్యూ సమస్యలు, ప్రజా ఫిర్యాదుల వేది కకు వచ్చే అర్జీల సత్వర పరిష్కారానికి పకడ్బందీగా చర్య లు చేపట్టాలని స్పష్టం చేశారు. నీటి పన్ను వసూలు చేయాలని, సిబ్బంది అవసరమైతే డిజిటల్ అసిస్టెంట్లను కేటాయిస్తామని తెలిపారు. 'తహసీల్దార్లు క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్యలను అక్కడికక్కడే పరిష్కరించాలి. ఉచిత ఇసుకపై సమస్యలుంటే తక్షణమే ఆపాలి. ఇబ్బందులను వీఆర్‌ఓకు తెలియజేయాలి. నీటి వనరుల దగ్గర, వంతెనలు వద్ద రాత్రిపూట ఇసుక తవ్వరాదు. సీజ్ చేసిన ఇసుక ఎక్కడైనా ఉంటే తెలపాలి. మరమ్మతులు అవసరమైన తహసీల్దార్ కార్యాలయాల అంచనా వ్యయా లను పంపాలి. ఈ-ఆఫీసుపై అవగాహన తప్పనిసరి'అని కలెక్టర్ తెలిపారు. సమావేశంలో జేసీ ఫర్మాన్ అహ్మద్ ఖాన్, డీఆర్వో వేంకటేశ్వరరావు, ఆర్డీవో కె.సాయి ప్రత్యూ ష, ఉప కలెక్టర్లు పద్మావతి, లక్ష్మణమూర్తి, జడ్పీ సీఈవో శ్రీధర్ రాజు, సర్వేఅండ్ ల్యాండ్ రికార్డ్స్ ఏడీ విజయకు మార్, తహసీల్దార్లు, డీటీలు పాల్గొన్నారు.

గృహ నిర్మాణ లక్ష్యాలను సాధించాలి

జిల్లాలో గృహ నిర్మాణాల లక్ష్యా లను సాధించాలని కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో గృహ నిర్మాణ శాఖ నిర్దేశిత లక్ష్యాలు, ప్రగతిపై అధికారులతో సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడు తూ 'జిల్లాలో 100 రోజుల వ్యవధిలో 5వేల గృహాలు, ఏడాదిలోపు 35వేల గృహాలను పూర్తి చేయాలి. డిసెంబరు 31వ తేదీ నాటికి రూఫ్ లెవెల్ పూర్త యిన భవనాలను శతశాతం పూర్తి చేయాలి. స్వయం సహాయక సం ఘ సభ్యులకు రుణాలు ఇప్పించి, వాటిని నిర్మాణాల కోసం వినియో గించేలా చర్యలు తీసుకోవాలి. ఉపాధిహామీ లబ్ధిదారులకు 90రోజుల పనిదినాలు కల్పించి వేతన లబ్ది చేకూర్చాల'ని సూచించారు. కార్యక్రమంలో హౌసింగ్ పీడీ బి.నగేష్ పాల్గొన్నారు.

ప్రాజెక్టులకు మహర్దశ వచ్చేనా?

- వైసీపీ హయాంలో నిలిచిన పనులు
- కూటమి సర్కార్‌పైనే రైతుల ఆశలు




పైడిగాం ప్రాజెక్టు

సోంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఇచ్ఛాపు రం నియోజకవర్గ పరిధిలో జల వనరులు సమృద్ధి గా ఉన్నా.. గత పాలకుల నిర్లక్ష్యంతో సాగునీరు అందక రైతులు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. గత వైసీపీ ప్రభుత్వం సాగునీటి ప్రాజెక్టుల అభివృద్ధిని విస్మరించింది. ప్రస్తుత కూటమి సర్కార్ అయినా ప్రాజెక్టులకు మహర్దశ కల్పించేలా చర్యలు చేపట్టా లని రైతులు వేడుకుంటున్నారు.

- సోంపేట కంచిలి, మందస మండలాలకు నీరందించే పైడిగాం ప్రాజెక్టు, కంచిలి మండలం లో గంగాసాగరం, గోవిందసాగరం, సుంకిలి సాగ రం, లొద్దాలొద్ది, ముకుందసాగరం, హనుమత్ సా గరంతోపాటు చిన్నా, పెద్దా సాగునీటి చెరువులు సైతం ఎక్కువే ఉన్నాయి. అయినా ఏటా రైతులు వర్షాలపైనే ఆధార పడాల్సి వస్తోంది. పైడిగాం ప్రాజెక్టును 1963లో నిర్మించగా 185 క్యూసెక్కుల సామర్థ్యం మేర నీరు వచ్చేది. 1985లో ఒడిశాలో పురియాసాయి డ్యాం నిర్మాణం వలన 135 క్యూసె క్కుల నీరు రావడం లేదు. ప్రస్తుతం 50క్యూసె క్కులు మాత్రమే వస్తోంది. ఈ ప్రాజెక్టు ఆధునికీక రణకు నోచుకోవడం లేదు. దీంతో మూడు మండ లాల పరిధిలోని 34 పంచాయతీల్లో వేలాది ఎకరా లకు సాగునీటి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ఈ ప్రాజెక్టు ద్వారా సోంపేట మండలం పైడిగాం, హంసమొర, విక్రంపురం, బుషాభద్ర, మాకన్నపు రం, పొత్రఖండ, బేసిరామచంద్రపురం, కొర్లాం, ప లాసపురం, సోంపేట, జింకిభద్ర తదితర గ్రామా ల్లో 3,950ఎకరాలకు సాగు నీరందేది. అలాగే కం చిలి మండలంలోని శాసనాం, జే.నారాయణపు రం, ఉప్పర పేటలు-3, చొట్రాయిపురం, గోకర్ణ పురం, పోటిగుడ్డి, మధుపురం, బూరగాం గ్రామాల్లో 800 ఎకరాలకు నీరు అందేది. మం దస మండలం మందస, పొత్తంగి గ్రామాల పరి ధిలోని 250 ఎకరాలకు నీరందేది. ప్రస్తుతం ఆ పరిస్థితి లేక రైతుల్లో ఆవేదన వ్యక్తమవుతోంది. ఈ ప్రాజెక్టు మరమ్మతుల కోసం 2014-15 సంవ త్సరంలో టీడీపీ ప్రభుత్వం రూ.9.75 కోట్ల నిధు లు మంజూరు చేసింది. ఈ నిధులతో 3/2 నుం చి 6/2 వరకు గోడల నిర్మాణం, దిగువ భాగంలో కాంక్రీటు పనులు పూర్తి చేశారు. 0/0 నుంచి 0/6 వరకు కాలువకు రెండు వైపుల గోడలు ని ర్మించాల్సి ఉంది. పైడిగాం ప్రాజెక్ట్‌ని లడ్డగుడ్డి వ ద్ద 3/2 వద్ద నిర్మిస్తే చీకటి గెడ్డ, ఘాటీ గెడ్డ, క ళింగదళ్‌నుంచి మిగులు నీరు ప్రాజెక్ట్‌లో చేరు తుంది. ప్రస్తుతం కేవలం మహేంద్రతనయ నదికి చేరిన వరద నీరు మాత్రమే వస్తోంది. వైసీపీ గత ఐదేళ్లలో ఒక్క రూపాయి కూడా నిధులు విడుదల చేయలేదు. కూటమి ప్రభుత్వం స్పందించి నిధులు మంజూరు చేయాలని రైతులు కోరుతున్నారు.

నిలిచిన గంగాసాగరం పనులు

సుమారు 1200 ఎకరాల ఆయకట్టు కలిగి, కంచిలి మండలంలోనే అతిపెద్ద సాగునీటి జలవనరుగా పేరుగాంచిన గంగాసాగర్ రిజర్వాయర్ నిర్మాణ పను లు ఏళ్ల తరబడి కొనసాగుతూనే ఉన్నా యి. 2007లో రిజర్వాయర్ ఏర్పాటు ప్ర తిపాదనలతో భూ సేకరణ చేశారు. రూ.3కోట్లతో పనులు ప్రారంభించినా పూర్తికాలేదు. అనంతరం 2019 ఫిబ్రవ రి 15న స్థానిక ఎమ్మెల్యే బెందాళం అశో క్ రూ.6.3కోట్ల అంచనాతో రిజర్వాయర్ పనులకు శంకుస్థాపన చేశారు. యుద్ధ ప్రాతిపదికన పనులు ప్రారంభించి సా గరం చుట్టూ రాతితో గట్టు ఏర్పాటు చే శారు. ఆ తర్వాత నిధులు విడుదల కాక పనులు మళ్లీ నిలిచిపోయాయి. సుంకిలి, గోవింద సాగరాలది కూడా ఇదే పరిస్థి తి. అధికారులు, పాలకులు స్పందించి సాగునీటి ఇబ్బందులు లేకుండా చర్యలు చేపట్టాలని ఈ ప్రాంత వాసులు విజ్ఞప్తి చేస్తున్నారు.



అసంపూర్తిగా గంగసాగరం పనులు



కోటి దీపోత్సవానికి ఏర్పాట్లు

శ్రీకాకుళం కల్చరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): శ్రీకాకుళంలో ఈ నెల 25న కోటి దీపోత్సవం నిర్వహించనున్నారు. ఆంజనేయ ఆలయ కమిటీ అధ్యక్షుడు ముక్కాల కొండబాబు ఆధ్వర్యంలో పీఎస్‌ఎన్‌ఎం స్కూల్ వెనుక మైదానంలో ఈ కార్యక్రమం నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నారు. ప్రత్యేక గ్యాలరీలతోపాటు అభిషేకం చేసేందుకు శివలింగాన్ని సిద్ధం చేస్తున్నారు.

ఇది ఆరు తరాల బుల్లెట్టూ!

- రాజసానికి చిహ్నం
- ద్విచక్ర వాహనాల్లో రారాజు
- ఇప్పటికీ చెక్కుచెదరని క్రేజ్
- యువత, నడివయస్కులు మెచ్చే బైక్
- పెరుగుతున్న బుల్లెట్ వాహన వినియోగం

6లో



- రాజసానికి చిహ్నం
- ద్విచక్ర వాహనాల్లో రారాజు
- ఇప్పటికీ చెక్కుచెదరని క్రేజ్
- యువత, నడివయస్కులు మెచ్చే బైక్
- పెరుగుతున్న బుల్లెట్ వాహనాల వినియోగం

ఇది ఆరుతరాల బుల్లెట్టూ

బుల్లెట్.. ఈ పేరు వింటే రాజసంతో కూడిన వాహనం మదిలో మెదులుతుంది. ఎన్ని తరాలు మారుతున్నా.. దీని ప్రత్యేకత మారడం లేదు. ఒకప్పుడు పెద్దరికానికి... దర్పానికి చిహ్నంగా నిలిచిన ఈ వాహనం... ఇప్పుడు కుర్రకారుకూ నచ్చేస్తోంది. కాలంతో పాటు మారుతున్న వినియోగదారుల అభిరుచులకు అనుగుణంగా కొత్త మార్పులు సంతరించుకుంటూ మార్కెట్‌లో తన మార్కును నిలబెట్టుకుంటోంది బుల్లెట్.


బుల్లెట్ క్లాసిక్ మోడల్

ఇచ్ఛాపురం/శ్రీకాకుళం క్రైం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)

'బుల్లెట్టు బండెక్కి వచ్చేత్తావా..' అంటూ ఇటీవల కుర్రకారు తెగ ఎదురు చూసేస్తున్నారు. అదీ దాని ప్రత్యేకత. మార్కెట్‌లోకి ఎన్ని రకాల వాహనాలైనా రానివ్వండి. బుల్లెట్‌ను దాటి ముందుకెళ్లేవి లేవనడంలో సందేహం లేదు. దీని రాజసమే వేరు. దీన్ని నడిపే వారు కనిపించే స్టైలే వేరు. బుల్లెట్ అంటే గతంలో ఉన్నత వర్గాల వారి వాహనం. కానీ ఇప్పుడు మధ్య తరగతి ప్రజలు సైతం వీటిపై దూసుకుపోతున్నారు. ఇది వరకూ గ్రామాల్లో పలుకుబడికి ...పెత్తందారుల దర్పానికి ఇది నిదర్శనంగా నిలిచేది. ఇప్పుడు అన్ని వర్గాల వారికీ అందుబాటులోకి వచ్చేసింది. కొత్త పెళ్లి కొడుకులకు అత్తవారు ఇచ్చే కానుకల జాబితాలోనూ ఇది చేరిపోయింది.

సుదీర్ఘ చరిత్ర..

బుల్లెట్‌కు సుదీర్ఘ చరిత్ర ఉంది. 1955లో ఇండియన్ బోర్డర్ సెక్యూరిటీ కోసం బుల్లెట్ బండిని ఇంగ్లండ్ నుంచి తెప్పించారు. 1960 నుంచి మన దేశంలోనే తయారు చేయడం ప్రారంభించారు. విదేశాల నుంచి స్పేర్ స్పార్ట్స్ తెచ్చి ఇక్కడ తయారు చేసేవారు. ఇవన్నీ గతంలో పెట్రోల్‌తోనే నడిచేవి. దాని తరువాత కొన్నేళ్ల పాటు కొంతమంది మెకానిక్‌లు డీజిల్ వెర్షన్‌లోకి మార్చి నడిపేవారు. ఆ సమయంలో డీజిల్ బుల్లెట్‌కు విపరీతమైన డిమాండ్ ఉండేది. 2000 ఏడాది వరకూ బుల్లెట్ కంపెనీ వారు డీజిల్ వెర్షన్‌నే మార్కెట్‌లోకి తెచ్చేవారు. కానీ తరువాత కాలుష్యాన్ని కారణంగా చూపుతూ నిషేధించారు. కొన్నాళ్ల తరువాత మళ్లీ వీటి ప్రస్థానం మొదలైంది. పెట్రోల్‌తో నడిచే బుల్లెట్లు వచ్చాయి. దీంతో వీటికి డిమాండ్ కూడా పెరిగింది.

ఇప్పటి వరకూ రాయల్ ఎన్‌ఫీల్డ్‌లో కాస్ట్ ఐరన్ స్టాండర్డ్, ఎలక్ట్రా, క్లాసిక్, థండర్ బాడ్, ఇంటర్‌స్పెక్టర్, కాంటినెంటల్ జీటీ, హిమాలయం, హంటర్ వంటి మోడల్స్ మార్కెట్‌లోకి వచ్చాయి. ఈ వాహనాలు యువతతో పాటు మధ్య వయసు వారినీ విపరీతంగా ఆకర్షిస్తున్నాయి.

కుర్రకారు ఆసక్తి..

ప్రస్తుతం మార్కెట్‌లో అధికశాతం 120 సీసీ నుంచి 180 సీసీ ద్విచక్ర వాహనాలే ఉన్నాయి. ఇవన్నీ కుర్రకారును దృష్టిలో పెట్టుకొని రూపొందినవే. కానీ యువత ఒక్కసారిగా బుల్లెట్ వైపు టర్న్ అయిపోయారు. బుల్లెట్లలో 350, 411, 500, 650 సీసీ సామర్థ్యంతో కూడినవి దొరుకుతున్నాయి. వీటి కొనుగోలుకు వారు ఆసక్తి చూపుతున్నారు. వాస్తవానికి బుల్లెట్ ధరతో సెకెండ్ హ్యాండ్ కారు కొనుగోలు చేయవచ్చు. అయినా సరే యువత మాత్రం బుల్లెట్‌ను మాత్రమే కొనుగోలు చేసేందుకు మక్కువ చూపుతున్నారు. ప్రస్తుతం మార్కెట్‌లో రూ.1.50 లక్షల నుంచి రూ.3.50 లక్షల వరకూ వీటి ధరలు ఉన్నాయి. అయినా వీటి కోసం క్యూ కడుతున్నారంటే..ఆ ప్రత్యేకతను అర్థం చేసుకోవచ్చు.

ఏటా వెయ్యికిపైగా....

ఉమ్మడి శ్రీకాకుళం జిల్లాలో 5 రాయల్ ఎన్‌ఫీల్డ్ షోరూమ్‌లు ఉన్నాయి. రాజాం, పాలకొండ, పలాస, టెక్కలి, శ్రీకాకుళంలో ఇవి ఉన్నాయి. ఐదేళ్ల కిందట ఒక్కో షోరూమ్ నుంచి నెలకు పదుల సంఖ్యలో మొదలైన అమ్మకాలు.. నేడు 100 దాటుతున్నాయి. ఏటా జిల్లాలో వెయ్యి నుంచి 1500 బుల్లెట్ల విక్రయాలు జరుగుతున్నట్టు షోరూమ్‌ల యజమానులు చెబుతున్నారు.



ప్రత్యేకంగా శిక్షణ పొందాను..

బుల్లెట్ నడిపితే ఆ దర్పమే వేరు. ప్రత్యేక హోదా కనిపిస్తుంది. గతంలో ఉన్నత వర్గాల వారి వాహనంగా ఉండేది. కానీ ఇప్పుడు సామాన్యులు సైతం వాడుతున్నారు. వాటి వినియోగం గణనీయంగా పెరిగింది. అందుకే బుల్లెట్ మెకానిక్‌గా ప్రత్యేక శిక్షణ తీసుకొని దుకాణాన్ని ఏర్పాటు చేశాను.

-ఇసురు భాస్కర్‌రెడ్డి, బుల్లెట్ మెకానిక్, ఇచ్ఛాపురం

శబ్దాన్ని బట్టి గుర్తు పట్టేవారు..


పాతిర్ల గోపాల్ రెడ్డి

1962 ప్రాంతమిది. ఆ సమయంలో ఇచ్ఛాపురం పట్టణంలో బుల్లెట్ శబ్దం వినిపిస్తే చాలు... అది పాతర్ల నరసింహారెడ్డి అని ఇట్టే గుర్తుపట్టేవారు. ఇచ్ఛాపురం మండలం మండపల్లికి చెందిన నరసింహారెడ్డి కుటుంబానికి మంచి నేపథ్యం ఉంది. అప్పట్లో రూ.4,700కి బుల్లెట్ కొనుగోలు చేశారు. అప్పట్లో ఇచ్ఛాపురం ప్రాంతంలో మూడు బుల్లెట్లే ఉండేవట. నరసింహారెడ్డి తరువాత కుమారుడు గోపాల్‌రెడ్డి వాడుతున్నారు. స్థానిక మెకానిక్‌లతో పాటు చాలామంది బైక్ రేసర్లు అడుగుతున్నారని... రూ.2 లక్షల వరకూ ధర కట్టి తీసుకెళ్లేందుకు ముందుకొస్తున్నారని గోపాల్ రెడ్డి తెలిపారు. తండ్రి జ్ఞాపకార్థంగా ఉన్న ఈ బుల్లెట్‌ను తన కుమారుడికి బహుమతిగా ఇస్తానని ఆయన చెబుతున్నారు.

1990 నుంచీ అదే...

ఇచ్ఛాపురం మునిసిపాల్టీ పరిధిలోని వీకేపేటకు చెందిన ప్రతాప్‌రెడ్డి 1990లో బుల్లెట్ కొనుగోలు చేశారు. నేటికీ అదే వాహనాన్ని వాడుతున్నారు. ఇటీవల కొత్త మోడల్ బుల్లెట్లు రెండింటిని కొనుగోలు చేశారు. కానీ పాత బుల్లెట్ అంటేనే ఎక్కువగా ఆసక్తి చూపుతున్నారు. ఆ బండి నడపడంలో ఉండే అనుభూతే వేరని చెబుతున్నారు. దానిని చూస్తుంటే కలిగే ఆనందాన్ని మాటల్లో చెప్పలేనని అంటున్నారు.


ఆ అనుభూతే వేరు..

50 ఏళ్ల కిందట మానాన్న చెన్నూరి చంద్రరావు బుల్లెట్‌ను కొనుగోలు చేశారు. ఆయన మరణించిన తరువాత ఇప్పటి వరకు అదే బుల్లెట్‌ను వాడుతున్నాను. ఇప్పుడు కొత్త బుల్లెట్ కొనుగోలు చేసి వాడుతున్నాను. అయినా పాత బుల్లెట్ అంత సౌండ్‌గానీ... స్మూత్‌గానీ లేదు. పాత బుల్లెట్ నడుపుతుంటే.. ఆ ఆనందమే వేరు. పాత బుల్లెట్‌ను కొనుగోలు చేసేందుకు యువత పోటీ పడుతున్నారు. కానీ అమ్మడం లేదు.

-గౌరీజీ, దాసన్నపేట, ఇచ్ఛాపురం

పాత కాలం బుల్లెట్లకూ డిమాండ్..

1970ల్లో పదుల సంఖ్యలో ఉండే బుల్లెట్లు నేడు జిల్లాలో వేల సంఖ్యలో ఉన్నాయి. నేటి సరికొత్త రకం బుల్లెట్ల కంటే ఒకప్పటి బుల్లెట్లపైనే వాహనదారులు ఆసక్తి చూపిస్తున్నారు. 1980, 1990ల్లో కొన్న బుల్లెట్లను ఇప్పటికీ వినియోగిస్తున్నారు. పాత కాలం బుల్లెట్లపైన ఆసక్తితో కొందరు ఒడిశాలో కొనుగోలు చేసుకుని వాటిని రీ మోడల్ చేయించి మరీ వాడుతున్నారు.


నరసింహారెడ్డి బుల్లెట్..

అభిరుచులకు అనుగుణంగా...

ప్రస్తుతం మార్కెట్‌లో బుల్లెట్ల వినియోగం పెరిగింది. పాతకాలం బుల్లెట్లకు రివర్స్‌గేర్ ఉంటుంది. వాటిని ప్రస్తుతం వాడకంలోకి మార్చాలని అడుగుతున్నారు. అప్పట్లో పెట్రోల్‌తో పాటు డీజిల్ బుల్లెట్లు ఉండేవి. వాటిని పెట్రోల్‌తో నడిచేటట్లు మారుస్తున్నాం. 1970, 1980 కాలం నాటి బుల్లెట్ల స్పేర్‌పార్టులు వైజాగ్, సాలూరు, ఢిల్లీ, జైపూర్‌లలో దొరుకుతున్నాయి. అక్కడి నుంచి సామాన్లు తీసుకొచ్చి నేటి తరం యువత అభిరుచులకు అనుగుణంగా బుల్లెట్లను తీర్చిదిద్దుతున్నాం.

-అలబాన మణి, మెకానిక్


రాయల్ ఎన్‌ఫీల్డ్ బుల్లెట్

ఉద్దానంలో.. ఎయిర్‌పోర్ట్?

(ఐదో పేజీ తరువాయి)

రానుండడంతో ఆర్థికాభివృద్ధి చెందనుంది. దీంతోపాటు భోగాపురం ఎయిర్‌పోర్టు నుంచి మూలపేట వరకు ఆరులైన్లు జాతీయ రహదారి తీరం వెంబడి నిర్మించనున్నారు. దానికి అనుసంధానంగా పలాస ఎయిర్‌పోర్టు నిర్మిస్తే వాణిజ్య, కార్గో, రవాణా వంటి అన్ని అవసరాలు తీరనున్నాయి. దీనిని ప్రజా అవసరాలకు అన్ని రకాల విమానాల రాకపోకలకు అనువుగా ఏర్పాటు చేయనున్నట్లు సీఎం చంద్రబాబు, కేంద్ర పౌరవిమానయాన శాఖామంత్రి రామ్మోహన్‌నాయుడు ఇప్పటికే ప్రకటించారు. ఈ ఎయిర్‌పోర్టు నిర్మాణంతో భోగాపురం, భువనేశ్వర్ మధ్య పలాసలో విమాన సౌకర్యంతో తెలుగు రాష్ట్రాలతోపాటు ఒడిశా వాసులకు ఎంతో సౌకర్యం కలుగనుంది.

పరిశీలన స్థాయిలోనే..

ఎయిర్‌పోర్టుకు స్థల పరిశీలన స్థాయిలోనే ప్రక్రియ కొనసాగుతోందని పలాస ఆర్డీవో వెంకటేష్ తెలిపారు. కేంద్ర విమానయాన బృందం, భూగర్భ శాఖలతోపాటు పలు శాఖల అధికారులు ఈ ప్రాంతాన్ని సందర్శించారు. దీనిపై ఉన్నత స్థాయిలో ఇచ్చిన నివేదిక మేరకు తదుపరి చర్యలు ప్రారంభించనున్నాం. మారుమూల ప్రాంతాలకు ఎయిర్‌పోర్టులు, నౌకాశ్రయాలు నిర్మాణాలు జరిగితే ఈ ప్రాంతం నుంచి అధికంగా విదేశాలకు నౌకామార్గాలద్వారా కోట్ల రూపాయాల వస్తువులు రవాణా జరుగుతుంది. దీంతో ఈ ప్రాంతం అభివృద్ధి జరిగి ప్రజలు తల రాతలు మారనున్నాయని ఆర్డీవో తెలిపారు. కార్యక్రమంలో ఆర్డీవోతోపాటు తహసీల్దార్ హైమావతి, డీటీ రామకృష్ణ, సర్వేయర్ బాబూరావు, ఏపీటీపీసీ చైర్మన్ వజ్జ బాబూరావు, రాష్ట్ర కాళింగ కార్పొరేషన్ డైరెక్టర్ బావన దుర్యోధన, లబ్బ రుద్రయ్య, బమ్మిడి కర్రయ్య, పొట్టి మోహన్ పాల్గొన్నారు.

ఈ చేప హాట్ గురూ!

- కాసులు కురిపిస్తున్న 'కలవలు'
- కోల్డ్ స్టోరేజీలు లేక ఇక్కట్లు


హుకుంపేట వద్ద మత్స్యకారుల వలల నిండుగా చిక్కిన కలవలు

వజ్రపుకొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల వలలకు కలవలు (చేపలలో ఓరకం) చిక్కుతుండడంతో ఆనందం వ్యక్తం చేస్తున్నారు. రెండు రోజులుగా వలల నిండుగా చేపలు చిక్కుతుండడంతో పాటు డిమాండ్ అధికంగా ఉండడంతో సంతోషం వ్యక్తం చేస్తున్నారు. ప్రస్తుతం చిన్నగంప చేపలు రూ.400 వరకు పలుకుతున్నాయని చెబుతున్నారు. కార్తీక మాసం తరువాత డిమాండ్‌తో పాటు ధర కూడా పెరుగుతుందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. కలవ చేపలు ఆరోగ్యానికి మంచిదనే భావనతో అత్యధిక శాతం వీటిని ఇష్టంగా తింటారు. బాయిలర్ కోళ్ల మేతకు కూడా కలవ రకం చేపలు వినియోగిస్తున్నారు. సాధారణంగా సముద్ర తీరానికి వచ్చిన కొనుగోలుదారులకు విక్రయించగా మిగిలిన వాటిని ఎండబెట్టి కోళ్ల ఫారాలకు అమ్ముతుంటారు. తీరంలో కోల్డ్‌స్టోరేజ్‌లు ఏర్పాటు చేస్తే ఈ రకం చేపలను ఇతర రాష్ట్రాలకు ఎగుమతి చేసే అవకాశం ఉందని మత్స్యకారులు చెబుతున్నారు. కలవ చేపలకు డిమాండ్ ఉన్నప్పటికీ నిల్వ చేసే సదుపాయాలు లేవని విచారం వ్యక్తం చేస్తున్నారు.

కలవ చేపలకు మంచి డిమాండ్..


ఈ సీజన్‌లో మత్స్యకార వలలకు చిక్కిన కలవ, నెత్తళ్ల అనే చేపలకు వైద్యపరంగా మంచి డిమాండ్ ఉంది. ఈ రకం చేపలలో తక్కువ స్థాయిలో కొలెస్ట్రాల్ ఉంటుంది. వీటని తినడం వల్ల ఆరోగ్యానికి ఎలాంటి నష్టం లేదు. దీంతోపాటు కోళ్ల ఫారాల యజమానులు మేతకు కూడా వీటిని వినియోగిస్తుంటారు.

-కొండ నాగరాజు, మండల మత్స్యశాఖాధికారి

ఆధ్యాత్మిక మార్గం... సేవా గుణం

- సత్యసాయి సేవా సమితుల ఔదార్యం

సత్యసాయికి 99 రకాల నైవేద్యాలు



భగవాన్ సత్యసాయిబాబా 99వ జన్మదినోత్సవాల్లో భాగంగా భక్తులు వినూత్నంగా నైవేద్యాలు సమర్పించారు. గురువారం స్థానిక రోటరీ నగర్‌లో గల శాంతి సుధా మందిరంలో సాయిభక్తుల ఆధ్వర్యంలో 99 రకాల వంటకాలతో నైవేద్యం ఏర్పాటు చేశారు. ప్రత్యేకంగా యువజన దినోత్సవ కార్యక్రమాలతో పాటు 99 పాటలను పాడారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ చంటి, అన్నపూర్ణమ్మ, జగదీశ్వరరావు, నారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.

-టెక్కలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి)

టెక్కలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): 'మానవ సేవే.. మాధవ సేవ' అనే భగవాన్ సత్యసాయిబాబా పిలుపు మేరకు జిల్లాలో 35 సత్యసాయి సేవా సమితులు, 120 భజన మండలుల ఆధ్వర్యంలో నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. జిల్లాలో లక్షకు పైగా ఉన్న సాయి భక్తులు వివిధ ప్రాంతాల్లో ఈ కార్యక్రమాల్లో భాగస్వాములవుతున్నారు. శనివారం సత్యసాయిబాబా జన్మదినం సందర్భంగా మరిన్ని సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్టు నిర్వాహకులు చెబుతున్నారు. ఇప్పటికే బాబా మందిరాల్లో మహిళా దినోత్సవం, యువజన, సేవాదళ్ దినోత్సవం వంటి కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. అలాగే పుట్టిన రోజు నాడు విద్యార్థులతో వివిధ కార్యక్రమాలు, నారాయణ సేవ, ప్రత్యేక పూజలు చేయించేందుకు బాబా భక్తులు సన్నాహాలు చేస్తున్నారు.

- చిన్ననాటి నుంచే మానవతా విలువలు పెంపొందించే లక్ష్యంతో 200 కేంద్రాల్లో సుమారు 50వేల మంది బాలబాలికలకు ఏటా బాలవికాస్ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.
- ప్రతినెల 9వ తేదీన వివిధ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల పరిధిలో గర్భిణులకు పౌష్టికాహారం అందిస్తున్నారు.
- అన్నపూర్ణ సేవ పేరిట శ్రీకాకుళం రిమ్స్‌లో 600 మందికి, టెక్కలి, నరసన్నపేట, పాతపట్నం, సోంపేట ఆస్పత్రుల్లో రోగుల సహాయార్థం వచ్చే వారికి ఉచిత భోజనాలు అందిస్తున్నారు.
- సత్యసాయి వైద్యసేవల పేరిట జిల్లా పెద్ద మందిరంలో వైద్యులు, వైద్య సిబ్బంది పర్యవేక్షణలో రోజూ 36 రకాల ఉచిత రక్త పరీక్షలు, అవసరమైన మందులు పంపిణీ చేస్తున్నారు.
- ఏడాది కాలంలో సత్యసాయి భక్తులు 300 యూనిట్ల రక్తాన్ని అందజేశారు.
- ప్రతినెల 19న అమృత కలశాల పేరిట ఒక నెలకు సరిపడే నిత్యావసర వస్తువులు, బియ్యాన్ని వివిధ సమితుల ఆధ్వర్యంలో పంపిణీ చేస్తున్నారు.
- నిరుద్యోగ యువతీ, యువకులకు స్కిల్‌డెవలప్‌మెంట్ కింద ఏసీ మెకానిక్, డేటా ఆపరేటింగ్ విభాగాల్లో శ్రీకాకుళం, కోటబొమ్మాళి, ఆమదాలవలస ప్రాంతాల్లో శిక్షణ ఇస్తున్నారు.
- శ్రీకాకుళం, టెక్కలి, హిరమండలం, పలాస, సోంపేటలలో కైవల్య రథాలను ఏర్పాటు చేశారు.
- జిల్లా నుంచి ఏటా జనవరి, ఏప్రిల్, నవంబరు నెలల్లో 500 మంది భక్తులు పుట్టపర్తి సేవకు వెళ్తున్నారు.

సేవలు విస్తృతం చేస్తాం..

వచ్చే ఏడాది సత్యసాయిబాబా వందో పుట్టిన రోజు సందర్భంగా గ్రామ స్థాయిలో కార్యక్రమాలు విస్తృతం చేస్తాం. పిల్లల్లో మానవతా విలువలు, నైతిక విలువలపై అవగాహన కల్పిస్తాం. భారతీయ సంస్కృతి, కళల విశిష్టతను వివరిస్తాం. పండగల ప్రాముఖ్యతను వివరిస్తాం. గ్రామాల్లో ఉచిత పశువైద్య శిబిరాలు నిర్వహించి మందులు పంపిణీ చేస్తాం. ప్రేమతరువు కింద వేల సంఖ్యలో మొక్కలు నాటడం, కుటుంబ నారాయణసేవ కింద అభాగ్యులకు ఆహారం అందజేయడం వంటివి చేస్తాం.

-రామచంద్రరావు, జిల్లా సత్యసాయి సేవా సంస్థల అధ్యక్షులు

7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలుకు సన్నాహాలు

- పౌర సరఫరాల శాఖ డి.ఎం. శ్రీనివాసు



జలుమూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఈ ఏడాది ఖరీఫ్‌కు సంబంధించి జిల్లాలో రైతుల నుంచి 7 లక్షల మెట్రిక్ టన్నుల ధాన్యం కొనుగోలు చేయడానికి ప్రణాళిక సిద్ధం చేసినట్లు పౌర సరఫరాల శాఖ డి.ఎం. కె.శ్రీనివాసు తెలిపారు. దీనికి సంబంధించి శాఖా పరంగా తీసుకుంటున్న చర్యలను ఆయన 'ఆంధ్రజ్యోతి'కి వివరించారు.

- **ప్రశ్న:** ధాన్యం కొనుగోలుకు ఎటువంటి చర్యలు చేపడుతున్నారు?
- **జవాబు:** జిల్లాలో గల 402 రైతు సేవా కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోలు చేయడానికి అన్ని ఏర్పాట్లు చేసాం. వీటితో పాటు కోఆపరేటివ్ సొసైటీలు, ఏజెన్సీల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం.
- **ప్ర:** ప్రస్తుతం ఎన్ని టన్నులు కొనుగోలుకు లక్ష్యం పెట్టుకున్నారు?
- **జ:** మొదటి విడతగా 4.90 లక్షల మెట్రిక్ టన్నుల కొనుగోలుకు ఏర్పాట్లు చేశాం.
- **ప్ర:** ధాన్యం విక్రయించిన రైతు ఖాతాకు ఎన్ని రోజుల్లో డబ్బులు జమ చేస్తున్నారు?
- **జ:** రైతు ధాన్యం విక్రయించిన 48 గంటల్లో వ్యక్తిగత ఖాతాలకు నగదు సర్దుబాటు చేస్తున్నాం.
- **ప్ర:** లేబరు చార్జీలు, రవాణా చార్జీలు ప్రభుత్వమే భరిస్తుందా?
- **జ:** గోనె సంచులు, లేబరు, రవాణా చార్జీలు ప్రభుత్వం రైతుకు చెల్లిస్తుంది. ధాన్యం విక్రయించిన వారం రోజుల్లో ఈ నగదు వారి వ్యక్తిగత ఖాతాలకు జమ చేస్తుంది.
- **ప్ర:** రైతులందరూ ధాన్యం శాంపిల్స్‌ను రైతు సేవా కేంద్రాలకు పంపించాలా?
- **జ:** రైతు ధాన్యం సిద్ధం చేసిన తరువాత సమాచారం రైతు సేవా కేంద్రానికి ఇవ్వాలి. టెక్నికల్ అసిస్టెంటు రైతు కళ్లం వద్దకు వెళ్లి శాంపిల్ తీసు కుంటారు. పరీక్షలు చేసి నాణ్యతా ప్రమాణాలను నిర్ధారించి.. ప్రభుత్వ నిబంధనల మేరకు ధాన్యం కొనుగోలు చేస్తారు.

రెడ్‌ఫోర్స్ బృందం పట్టివేత

● రెండు చోట్ల మాక్‌డ్రిల్

శ్రీకాకుళం క్రైం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): జిల్లాలో రెండు రోజుల పాటు నిర్వహించిన సాగర్ కవచ్ గురువారంతో ముగిసింది. ఈ నేపథ్యంలో నగరంలో రెండుచోట్ల మాక్‌డ్రిల్ నిర్వహించారు. వివరాల్లోకి వెళ్తే.. నగరంలోని కలెక్టరేట్ వద్ద ఇద్దరు వ్యక్తులు డమ్మీ ఆర్‌డీఎక్స్ బాంబ్ అమర్చేందుకు గురువారం మధ్యాహ్నం 12.45 గంటల సమయంలో ప్రయత్నించారు. ఈ మేరకు ఇద్దరు రెడ్‌ఫోర్స్ బృందాన్ని మెరైన్ సీఐ బర్ల ప్రసాదరావు తన సిబ్బందితో పట్టుకున్నారు. కలెక్టర్‌కు వినతిపత్రం అందించేలా బ్యాగు వేసుకుని ఇద్దరు వ్యక్తులు కలెక్టరేట్ లోపలికి వెళ్తుండగా.. వారిని సీఐ ప్రసాదరావు విచారించి తనిఖీలు చేశారు. బ్యాగులో నకిలీ ఆర్‌డీఎక్స్ ప్యాకెట్ కనిపించడంతో వారిని అరెస్టు చేసి వన్‌టౌన్ పోలీసు స్టేషన్‌కు తరలించి, కోస్టల్ డీఐజీ గోపీనాథ్‌కు జట్టికి సమాచారం అందించి విడిచిపెట్టారు. అనంతరం వారు మళ్లీ ఆర్టీసీ కాంప్లెక్స్‌లో డమ్మీ బాంబులు అమర్చేందుకు ప్రయత్నించగా ఏఎస్ఐ వారిని పట్టుకుని సీఐ ప్రసాదరావుకి సమాచారం అందించారు. వన్‌టౌన్‌లో ఉన్న సీఐ క్షణాల్లో అక్కడకు చేరుకుని వారిని జిల్లా పోలీసు కార్యాలయానికి తరలించి వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ తనిఖీల్లో మెరైన్ సీఐ ప్రసాదరావుతో పాటు ఎస్ఐలు వి.బాలకృష్ణ, కె.మహాలక్ష్మి, ఏఎస్ఐ వైకుంఠరావు, హెచ్‌సీ శ్యామలరావు తదితరులు పాల్గొన్నారు.


కలెక్టరేట్ వద్ద పట్టుబడిన 'రెడ్‌ఫోర్స్ బృందం'

● సోంపేట, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): తీర ప్రాంత గ్రామాల్లో సాగర్ కవచ్ గురువారం చేపట్టారు. ఇందులో భాగంగా మెరైన్ పోలీసులు మాక్‌డ్రిల్ నిర్వహించారు.

ఆర్థిక తోడ్పాటు

శ్రీకాకుళం అర్బన్, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): వీధి విక్రయదారులకు ఆర్థిక తోడ్పాటందించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు చర్యలు చేపడుతున్నాయని మెప్మా పీడీ ఎస్‌వీ రమణ అన్నారు. స్వానిధి టీ-స్వాభిమాన్ టీ-పక్వాడో పక్షోత్సవాల్లో భాగంగా మెప్మా ఆధ్వర్యంలో గురువారం కళింగరోడ్‌లో ఉన్న యూనియన్ బ్యాంకులో వీధి విక్రయదారులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.

మత్స్యకార సమస్యల పరిష్కారానికి కృషి చేస్తా

● ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు


మాట్లాడుతున్న విజయనగరం ఎంపీ కలిశెట్టి

అరసవల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మత్స్యకారుల సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. ప్రపంచ మత్స్యకార దినోత్సవం గురువారం నగరంలోని స్థానిక మత్స్య శాఖ కార్యాలయ ప్రాంగణంలో జరిగింది. ఈ కార్యక్రమానికి ఎంపీ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. మత్స్యకార నాయకులు, సాగర మిత్రలకు ఎంపీ చేతుల మీదుగా మత్స్యశాఖ ధ్రువపత్రాలను అందించి అభినందించారు. అనంతరం ఎంపీని మత్స్యశాఖ అధికారులు, డీడీ శ్రీనివాసరావు ఆధ్వర్యంలో సన్మానించారు. కార్యక్రమంలో మత్స్యకార సంఘ నాయకులు, ఆ శాఖ ఉద్యోగులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన టీడీపీ నాయకులు


చంద్రబాబుతో గార మండల టీడీపీ నాయకులు

గార, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండల టీడీపీ నాయకులు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడును గురువారం అమరావతిలో ఎమ్మెల్యే గొండు శంకర్ ఆధ్వర్యంలో కలుసుకున్నారు. ఈ సందర్భంగా ప్రసిద్ధ శ్రీకూర్మం క్షేత్రం అభివృద్ధికి నిధులు మంజూరు చేయాలని కోరినట్టు తెలిపారు. టీడీపీ నాయకులు కైబాడి రాజు, పొట్నూరు కృష్ణమూర్తి, ఎల్.రాధాకృష్ణ రెడ్డి, జేసీ దేవదాస్ మాస్టర్ తదితరులు సీఎంను కలుసుకున్నారు.

టీడీపీ సభ్యత్వంతో నూతనోత్తేజం

ఎచ్చెర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): టీడీపీలో సభ్యత్వం తీసుకోవడంతో నూతనోత్తేజం వెల్లివిరుస్తుందని విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడు అన్నారు. చిలకపాలెం గ్రామంలో గురువారం నిర్వహించిన పార్టీ సభ్యత్వ నమోదులో పాల్గొన్న ఆయన మాట్లాడారు. కార్యక్రమంతో పార్టీకి మరింత బలం చేకూరుతుందన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బెండు మల్లేశ్వరరావు, గాలి వెంకటరెడ్డి, అన్నెపు భువనేశ్వరరావు, బల్లాడ అరుణ తదితరులు పాల్గొన్నారు. ● రణస్థలం: విజయనగరం ఎంపీ కలిశెట్టి అప్పలనాయుడును రజక కార్పొరేషన్ సభ్యుడు గురజాపు రాము గురువారం మర్యాదపూర్వకంగా కలిశారు. రజకుల సమస్యలు ఆయన దృష్టికి తీసుకెళ్లారు.

ఐదుగురు జూదరుల అరెస్టు

పొందూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కింతలి గ్రామం వద్ద గురువారం టాస్క్ ఫోర్సు పోలీసులు జరిపిన దాడిలో పేకాటా డుతున్న ఐదుగురు వ్యక్తులు పట్టుబడ్డారు. టాస్క్‌ఫోర్సు పోలీసులకు అందిన సమా చారంతో కింతలి సమీపంలో దాడులు నిర్వ హించారు. కంతలి సమీపంలో ఖాళీస్థలం లో పేకాటాడుతున్న శిబిరంపై దాడిచేసి కిం తలి గ్రామానికి చెందిన బొడ్డేపల్లి అప్పారా వుతో సహా మరో నలుగురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.29,060 నగదు, మూడు సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. పొందూరు పోలీసులకు అప్పగించారు. ఎస్ఐ వారిని అరెస్టుచేసి కేసు నమోదు చేశారు.

ఐటీ హబ్ ఏర్పాటు చేయాలి

● అసెంబ్లీలో ఎమ్మెల్యే ఎన్ఈఆర్


అసెంబ్లీలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఈశ్వరరావు

రణస్థలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎచ్చెర్ల నియోజకవర్గం పరిధి లో ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని ఎమ్మెల్యే నడుకుదిటి ఈశ్వరరావు (ఎన్ఈఆర్) అన్నారు. గురువారం అసెంబ్లీ సమావేశంలో ఆయన పాల్గొ ని మాట్లాడారు. విశాఖకు సమీపంలో ఉన్న ఎచ్చెర్ల నియోజకవర్గంలో ఐటీ హబ్ ఏర్పాటు చేస్తే ఎంతో ప్రయోజన కరంగా ఉంటుందన్నారు. భోగాపురం ఎయిర్ పోర్టుకు 25 కిలోమీటర్ల దూరంలో ఎచ్చెర్ల సెగ్మెంటు ఉందిని, అంబేడ్కర్ వర్సిటీ, ట్రిపుల్ ఐటీ, మరికొన్ని విద్యాసంస్థలు ఉన్నందున ఐటీ హబ్ ఏర్పాటు చేయాలని కోరారు.

నేడు 'బొల్లినేని'లో జాబ్‌మేళా

శ్రీకాకుళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రాగోలు సమీపంలో ఉన్న జెమ్స్ ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న 'బొల్లినేని మెడ్‌స్కిల్స్'లో శుక్రవారం జాబ్‌మేళా నిర్వహిస్తున్నట్లు ఆ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సీహెచ్ నాగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఫైజర్ హెల్త్‌కేర్ ఇండియా ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ పతినిధుల ఆధ్వర్యంలో జాబ్‌మేళా జరుగుతుందని వారు తెలిపారు. ఇంటర్ పూర్తిచేసిన 18 నుంచి 20 ఏళ్లలోపు వయస్సున్న విద్యార్థినులు మాత్రమే అర్హులని వివరించారు. శుక్రవారం ఉదయం 8.30 గంటలకు జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. మరిన్ని వివరాల కోసం 7680945357, 7995013422 నంబర్లను సంప్రదించాలని.. లేదా జెమ్స్ వైద్య కళాశాల ప్రాంగణంలో ఉన్న తమ సంస్థను సంప్రదించవచ్చని స్పష్టం చేశారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

జి.సిగడాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని పలు గ్రామాలకు శుక్రవారం విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్టు శ్రీకాకుళం విద్యుత్ ఈఈ పి.యోగేశ్వరరావు, ఏఈ పి.దుర్గాప్రసాద్ తెలిపారు. సిరిపురం ఫీడర్ పరిధిలో 11 కేవీ విద్యుత్ లైన్ల మరమ్మతులు కారణంగా ఆనందపురం, దవళపేట, ఆబోతులపేట, సంతవురిటి, పాలఖండ్యాం, మెట్టవలస, మద్రివలస తదితర గ్రామాలకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు తెలిపారు. ● గార, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తూలుగు విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలో మరమ్మతులు చేపట్టనుండడంతో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ఆ శాఖ ఈఈ పైడి యోగేశ్వరరావు గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు కుమ్మరిపేట, కొయ్యానపేట, శాలిహుండాం మంచినీటి పథకం పరిసరాల్లో సరఫరా నిలిపివేస్తామన్నారు.

రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడి రాజీనామా

● కొత్త అధ్యక్షుడిగా సత్యశ్రీనివాస్?

శ్రీకాకుళం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): రైస్ మిల్లర్ల సంఘం జిల్లా అధ్యక్షుడు వాసు రాజీనామా చేశారు. చాన్నాళ్ల నుంచి వాసు అధ్యక్షుడిగా కొనసాగుతున్నారు. ప్రభుత్వం మారడంతో కూటమిలో ఉన్న నాయకులు ఈ బాధ్యత చేపట్టాలని భావిస్తున్నారు. ఈ నేపథ్యంలో వాసు రాజీనామా చేయడంతో కోటబొమ్మాళి మండలానికి చెందిన బోయిన గోవిందరాజు కుమారుడు సత్యశ్రీనివాస్ పేరు ఇప్పుడు వినిపిస్తుంది. బోయిన కుటుంబం దశాబ్దాల నుంచి కింజరాపు కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో సత్యశ్రీనివాస్‌ను రైస్ మిల్లర్ల సంఘం జిల్ల అధ్యక్షుడిగా నిలపాలని బోయిన గోవిందరాజులు, పలు రైస్ మిల్లర్ల యాజమానులు భావిస్తున్నారు. అయితే కొద్ది మంది రైస్‌మిల్లర్ల మండల అసోసియేషన్ వారు ఎన్నికలు నిర్వహించాలని అంతర్గతంగా పట్టుబడుతున్నట్టు సమాచారం.

ధర్నా విజయవంత చేయండి

రణస్థలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వ కార్మిక, రైతాంగ వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా ఈనెల 26న కలెక్టరేట్ వద్ద జరగనున్న ధర్నా కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని సీఐటీయూ నాయకులు సీహెచ్ అమ్మన్నాయుడు పిలుపునిచ్చాడు. గురువారం పైడిభీమవరంలో ధర్నాకు సంబంధించిన కరపత్రాలను ఆవిష్కరించారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి


కృష్ణ(ఫైల్)

గార, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వమరవల్లి కూడలి మలుపు దగ్గరలో గురువారం మధ్యాహ్నం జరిగిన రోడ్డు ప్రమాదంలో గొర్లె కృష్ణ(25) మృతి చెందాడు. మరో వ్యక్తి గొర్లె గణేష్ గాయపడ్డాడు. పోలీసులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు..చిన్న తోణంగి గ్రామానికి చెందిన కృష్ణ, గణేష్ ద్విచక్రవాహనంపై బంధువుల పాప జన్మదినం పురస్కరించుకుని స్వీట్స్ కొని తెచ్చేందుకు గార వెళ్తుండగా వమరవెల్లి కూడలి సమీపంలోని మలుపు వద్ద రోడ్డు పక్కన ఉన్న విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్నారు. దీంతో డ్రైవింగ్ చేస్తున్న కృష్ణారావు అక్కడిక్కక్కడే మృతి చెందాడు. వెనుకన కూర్చొన్న గణేష్ గాయపడడంతో 108 వాహనంలో శ్రీకాకుళం తరలించారు. కాగా ఈ ఘటనలో విద్యుత్ స్తంభం విరిగి పోయింది. ఎస్ఐ ఆర్.జనార్దన్ ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించారు. కృష్ణ తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు.. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ తెలిపారు.

కిడ్నీవ్యాధితో బాలిక..

కంచిలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కిడ్నీవ్యాధితో బాధపడుతూ వర్షాకుమారి బిసాయి(14) పలాస ఆసుపత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. స్థానికులు, కుటుంబ సభ్యుల కథనం మేరకు.. కంచిలి మండలం తలతంపరకు చెందిన వర్షాకుమారి బిసాయి 9వ తరగతి వరకు చదివింది. నాలుల కిందట పదో తరగతి చదవాల్సిన సమయంలో అనారోగ్యానికి గురైంది. దీంతో కుటుంబ సభ్యులు పలాస ఆసుపత్రికి తరలించి చికిత్స అందజేశారు. ఈ క్రమంలో వైద్యులు పరీక్షలు నిర్వహించి కిడ్నీవ్యాధి ఉన్నట్టు నిర్ధారించారు. ఈ నేపథ్యంలో వర్షాకుమారి బుధవారం డయాలసిస్ చేయించుకుంటుండగా పరిస్థితి విషమంగా మారింది. దీంతో పలాస ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ గురువారం మృతి చెందింది.

800 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

మెళియాపుట్టి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): మండలంలోని అప్పోజిపేటలో గురువారం టెక్కలి నరసన్నపేట, కోటబొమ్మాళి ఎక్సైజ్ సిబ్బంది దాడులు నిర్వహించి 800 లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్లు టెక్కలి ఎక్సైజ్ సీఐ మీరా సాహెబ్ తెలిపారు.సవర మర్రిపాడులో అక్రమంగా నిల్వచేసిన పది లీటర్ల సారా స్వాధీనం చేసుకుని ఒకరిని అరెస్టుచేసినట్లు చెప్పారు.

20లీటర్ల సారా..

సోంపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎక్సైజ్ అధికారులు గురువారం నిర్వహించిన దాడుల్లో 20లీటర్ల సారా, 700లీటర్ల బెల్లంఊట ధ్వంసం చేసినట్టు సీఐ కె.బేబీ, ఎస్ఐ జాకప్రసాద్ తెలిపారు.

ఇసుక లారీలు సీజ్

రణస్థలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ఎటువంటి బిల్లులు లేకుండా విశాఖకు అక్రమంగా మూడు లారీలతో తరలిస్తున్న ఇసుకను గురువారం రామతీర్థం జంక్షన్ వద్ద జేఆర్‌పురం ఎస్ఐ చిరంజీవి పట్టుకున్నారు. వారి వద్ద బిల్లులు లేకపోవడంతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ తెలిపారు. ఈ మేరకు లారీలు సీజ్ చేశారు.

ఆరు పశువులు స్వాధీనం

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తిలారు నుంచి కొత్తపేట అక్రమంగా వాహనంలో తరలిస్తున్న పశువులు వ్యాన్‌ను ఎస్ఐ దుర్గాప్రసాద్ గురువారం రాత్రి జమ్ము జంక్షన్‌లో పట్టుకున్నారు. సంత నుంచి ఆరు ఎద్దులను వాహనంలో తరలిస్తుండగా డ్రైవర్‌తోపాటు మరొకరిపై కేసు నమోదుచేశారు.ఈ మేరకు పశువులను స్వాధీనం చేసుకున్నట్లు ఎస్ఐ తెలిపారు.

నరసన్నపేటలో అక్రమ నిర్మాణం తొలగింపు

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): నరసన్నపేటలోని లక్ష్మి థియేటర్ వద్ద అక్రమ నిర్మాణాన్ని పంచాయతీ అధికారులు గురువారంరాత్రి తొలగించారు. ఇటీవల అక్రమ నిర్మాణాలు రాత్రి సమయంలో చేపట్టడంతో స్థానికుల ఫిర్యాదులతో రెవెన్యూ, పంచాయతీ, పోలీసులు అధికారులు అడ్డుకున్నారు.ఈ స్థలంలో షెడ్ నిర్మించేందుకు లీజుదారులు ప్రయత్నించగా పంచాయతీ, రెవెన్యూ అధికారులు నిలిపివేశారు. ఆర్‌అండ్‌బీకి చెందిన స్థలమని పేర్కొని గత ప్రభుత్వహయంలో నిర్మాణాలను తొలగించిన విషయం విదితమే. ఈనేపథ్యంలో గురువారం రాత్రి గుట్టుచప్పుడు కాకుండా షెడ్ నిర్మించగా, స్థానికులు పంచాయతీ అధికారులకు ఫిర్యాదు చేయగా, ఈవో ద్రాక్షాయిణి, తహసీల్దార్ సత్యనారాయణ, ఎస్ఐ దుర్గాప్రసాద్ నిర్మాణాలను అడ్డుకున్నారు. ఎటువంటి పత్రాలు ఉంటే తీసుకురావాలని నిర్మాణదారులకు సూచించారు.కాగానిర్మాణాన్ని తొలగించామని ఈవో ద్రాక్షాయిణి తెలిపారు.

బంగారు ఆభరణం అప్పగింత

వజ్రపుకొత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): బైపల్లికి చెందిన దున్న పుష్పలత పోగుట్టుకున్న మూడుతులాల బంగారం ఆభరణాన్ని మామిడిపల్లి పాఠశాల ఉపాధ్యాయుడు ఎస్వీ కృష్ణారావు గురువారం బాధిత కుటుంబానికి అందజేసి నిజాయితీ చాటుకున్నారు. బాధితురాలి కథనం మేరకు.. దున్న పుష్పలత ఈనెల 18న మార్కెట్లో పనులు నిమిత్తం కాశీబుగ్గ వచ్చింది. ఆ సమయంలో తన మెడలో ఉన్న మూడు తులాల బంగార ఆభరణం జారిపోయింది. ఇంటికి వెళ్లి చూడగా వస్తువు కనిపించకపోవడంతో వెదికారు. కాశీబుగ్గ మార్కెట్‌లో పడిపోయినట్లు నిర్ధారణకు వచ్చి సోషల్‌మీడియాలో పోస్టులు పెట్టారు. ఈ విషయం తెలుసుకున్న ఉపాధ్యాయుడు తనకు దొరికిన బంగార ఆభరణం గురించి బాధిత కుటుంబానికి సమాచారంఅందించారు. ప్రస్తుతం పెసరపాడురోడ్డులో నివాసముంటున్న కృష్ణారావు ఇంటికి పుష్పలత భర్త లక్ష్మణ్ వెళ్లి బంగారు ఆభరణాన్ని అందజేశారు.

25న నరసన్నపేటలో తెప్పోత్సవం

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక గోరువాని చెరువులో పార్వతీ పరమేశ్వర విగ్రహం వద్ద ఈనెల 25న తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు భవానీపురం యూత్ ఆర్గనైజేషన్ సభ్యులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. శ్రీభమరాంబిక మల్లికార్జున స్వామి ఉత్సవమూర్తులను ఊరేగించి సాయంత్రం ఆరుగంటలకు దీపోత్సవం, అనంతరం తెప్పోత్సవం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.


26న రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవం

పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):శ్రీకాకుళం ఏడురోడ్లకూడలి నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకూ ఈనెల 26న రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని నిర్వహించేర్యాలీనివిజయవంతం చేయాలని రాజ్యాంగ హక్కుల పరిరక్షణావేదిక నాయకులు చల్లా శాంతారావు, సవర కుమార్ కృష్ణారావు, గేదెల సంపత్ కుమార్, వసంత్, మిన్నారావు, రామారావు, తులసీరావు జి.రాము కోరారు. ఈ మేరకు పాతపట్నంలో గురువారం జరిగిన కార్యక్రమంలో రాజ్యాంగ పరిరక్షణ దినోత్సవ కార్యక్రమం కరపత్రాలను ఆవిష్కరించారు.

10న చలో విజయవాడ

సంతబొమ్మాళి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీపీఎస్, జీపీఎస్ రద్దు చేసి పాత పెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ డిసెంబరు పదోతేదీన నిర్వహించే చలో విజయవాడ వాల్‌పోస్టర్‌ను ఏపీసీపీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు రెడ్డి సూరిబాబు సంతబొమ్మాళిలో ఆవిష్కరించారు. కార్యక్రమంలో పిల్లల ఫల్గుణరావు, నర్సింహమూర్తి పాల్గొన్నారు.

పర్లాకిమిడిలో మత్స్యకార దినోత్సవం



పర్లాకిమిడి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):పర్లాకిమిడిలోని గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ కేంద్రంలో మత్స్య, పశుగణాభివృద్ధిశాఖ ఆధ్వర్యంలో ప్రపంచ మత్స్యకార దినోత్సవం గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా గజపతి జిల్లా మత్స్యశాఖ అధికారి అధ్యక్షతన జరిగిన సమావేశంలో కలెక్టర్ విజయ్ కుమార్‌దాస్ మాట్లాడుతూ మత్స్యకారులకు ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని తెలిపారు. కార్యక్రమంలో పీడీ సురేష్‌కుమార్ పట్నాయక్, ఉద్యానవన శాఖ డీడీ సుసాంత్‌రంజన్ దాస్, లీడ్ బ్యాంక్‌మేనేజర్ మహేశ్వర్ మండల్ పాల్గొన్నారు.

తిరుపతి పాణిగ్రాహికి ఒడిశా రత్న పురస్కారం

పర్లాకిమిడి, నవంబరు21(ఆంధ్రజ్యోతి): పార్లా స్వాభిమాన్‌మంచ్ అధ్యక్షుడు, హైటెక్ విద్యాసంస్థల అధినేత తిరుపతి పాణిగ్రాహికి ఒడిశా రత్న పురష్కారం లభించింది. ఈ మేరకు గురువారం భువనేశ్వర్‌లో జరిగిన నవ ఉత్కళ నిర్మాత హరేకృష్ణ మహ తాబ్ 125వ జయంతి వేడుకల్లో భాగంగా మాజీ గవర్నర్ విశ్వభూషణ్ హరిచందన్, మాజీ ఎమ్మెల్యే సురేష్ కుమార్ రైత్రాయ్, జట్నీ ఎమ్మెల్యే మన్మథ రౌత్రాయ్ తిరుపతి పాణిగ్రాహికి అవార్డును ప్రదానం చేశారు.

విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలి

● ఎస్పీ మహేశ్వరరెడ్డి


పోలీస్‌స్టేషన్ ఆవరణను పరిశీలిస్తున్న మహేశ్వరరెడ్డి

హిరమండలం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి):విధి నిర్వహణలో అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ కేవీ మహేశ్వరరెడ్డి పోలీస్ సిబ్బందికి సూచించారు. గురువారం హిరమండలం పోలీస్ స్టేషన్‌లో తనిఖీ నిర్వహించారు. తొలుత స్టేషన్‌లో రికార్డులు, పరిసరాలు, పోలీస్ క్వార్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా మాటాడుతూ గంజాయి, నాటు సారా అక్రమ రవాణా అరికట్టాలన్నారు. అసాంఘిక కార్యకలాపాల నియంత్రణకు పటిష్టమైన చర్యలు చేపట్టాలని, నేర నియంత్రణపై ప్రత్యేక దృష్టి సారించాలని పోలీస్ సిబ్బందికి సూచించారు. అనంతరం స్టేషన్ ఆవరణలో మొక్కలు నాటారు. ఆయనతోపాటు కొత్తూరు సీఐ చింతాడ ప్రసాదరావు, ఎస్ఐ ఎండీ యాసిన్ ఉన్నారు.

బెల్ట్ దుకాణాలపై దృష్టి సారించాలి

● ఎక్సైజ్ డిప్యూటీ కమిషనర్ శ్రీకాంత్‌రెడ్డి


ఎక్సైజ్ కార్యాలయంలో రికార్డులను పరిశీలిస్తున్న శ్రీకాంత్‌రెడ్డి

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో బెల్ట్ దుకాణాలపై దృష్టి సారించాలని ఎక్సైజ్ శాఖ డిప్యూటీ కమిషనర్ డి. శ్రీకాంత్‌రెడ్డి కోరారు. గురువారం నరసన్నపేట ఎక్సైజ్ సర్కిల్ కార్యాలయాన్నిపరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న కేసులకు త్వరగా చార్జిషీట్లు వేయాలని, రెండేళ్లలో ఎక్సైజ్ నేరాలకు పాల్పడిన వారిపై బైండ్‌వర్ కేసులు పెట్టాలని కోరారు. మద్యం దుకాణాల్లో నిబంధనలు పాటించే విధంగా విస్తృత తనిఖీలు చేయాలన్నారు.గంజాయి అమ్మకాలు లేకుండా చర్యలు తీసుకోవాలని ఎన్‌పీఎల్ మద్యం రాకుండా వాహనాలను తనిఖీలు చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో సీఐ రమణ, ఎస్ఐ గురుమూర్తి పాల్గొన్నారు.

ఎత్తిపోతల పథకాలు పూర్తిచేయాలి

● పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు


చంద్రబాబునాయుడుకు సమస్యలను వివరిస్తున్న ఎంజీఆర్

పాతపట్నం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో అర్థాంతరంగా నిలిచిపోయిన ఎత్తిపోతల పథకాలు పూర్తిచేయడంతోపాటు కొత్తగా మంజూరుచేయాలని పాతపట్నం ఎమ్మెల్యే మామిడి గోవిందరావు కోరారు. గురువారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడును కలిశారు. ఈ సందర్భంగా సమస్యలను వివరించి, నియోజకవర్గం అభివృద్ధికి నిధులు మంజూరుచేయాలని కోరారు. రహదారుల మరమ్మతులు,నిర్మాణానికి సహ కరించాలని, ఇండస్ట్రియల్ కారిడార్ ఏర్పాటు చేయాలని, వంశధార నిర్వాసితులను ఆదుకోవడా నికి చర్యలు తీసుకోవాలని కోరారు.

నెహ్రూపార్కులో సౌకర్యాలు కల్పించండి

పలాస, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ముత్యాలమ్మకోనేరు- నెహ్రూపార్కులో కనీస సౌకర్యాలు కల్పించాలని వాకర్స్‌క్లబ్ క్లబ్ అధ్యక్షుడు జి.రాజేంద్రనాయుడు, దడియాల నర్సింహులు, లండ నాగరాజు, బి.శంకరరావు, ఎస్.వసంతు కోరారు. ఈ మేరకు పలాస-కాశీబుగ్గ మునిసిపల్ కమిషనర్ ఎన్.రామారావుకు గురువారం వినతిపత్రం అందజేశారు. పార్కులో రాత్రులు విషజంతువులు తిరుగుతున్నాయని, విద్యుదీకరణ చేసి పార్కును అభివృద్ధి చేయాలని కోరారు.

సమాచారమివ్వండి

శ్రీకాకుళం రూరల్, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాత్రునివలసలోని ఓ అపార్ట్‌మెంట్‌లో ఈ నెల 1వ తేదీ రాత్రి జరిగిన దొంగతనానికి పాల్పడిన వ్యక్తిని సీసీ కెమెరాల సాయంతో గుర్తించారు. ఆ దొంగ నగర శివారు ప్రాంతాల్లో సంచరిస్తున్నట్టు పోలీసులు అనుమానిస్తున్నారు. ఈ నేపథ్యంలో సీసీ ఫుటేజీలో ఉన్న దొంగ చిత్రాన్ని గురువారం పోలీసులు విడుదల చేసి ప్రజలను అప్రమత్తం చేశారు. ఈ వ్యక్తి ఎక్కడైనా తారసపడితే పోలీసులకు సమాచారం ఇవ్వాలని శ్రీకాకుళం సీఐ కె.పైడపునాయుడు పిలుపునిచ్చారు.

పౌష్టికాహారంపై దృష్టిసారించాలి

గుజరాతీపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): వసతి గృహాల పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుకుని, పౌష్టికాహారంపై ప్రత్యేక దృష్టిసారించాలని సీనియర్ సివిల్ న్యాయాధికారి, జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి ఆర్.సన్యాసి నాయుడు అన్నారు. బాలసదనం, అసరవల్లి, శిశుగృహ, స్త్రీ సదనం, శాంతా కల్యాణ అనురాగ నిలయం, నాగజ్యోతి అనురాగ నిలయం సందర్శించారు. నిర్వాహకుల తో వారి స్థితిగతులను అడిగి తెలుసుకున్నారు.

కొవ్వాడ అణు విద్యుత్తు ప్లాంట్ రద్దు చేయాలి

అరసవల్లి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొవ్వాడ అణువిద్యుత్తు ప్లాంటును రద్దు చేయాలని సీపీఎం జిల్లా కార్యవర్గ సభ్యుడు పి.తేజేశ్వరరావు, కమిటీ సభ్యులు సీహెచ్ అమ్మన్నా యుడు డిమాండ్ చేశారు. నగరంలోని ఎన్‌జీవో హోమ్ వద్ద గల కొవ్వాడ అణు విద్యుత్తు కేంద్రం ప్రత్యేక డిప్యూటీ కలెక్టర్ కార్యాలయం ఎదుట గురువారం ధర్నా నిర్వహించారు.

తత్వశాస్త్ర అధ్యాయనంతో అన్నింటిపై అవగాహన

ఎచ్చెర్ల, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): తత్వ శాస్త్ర అధ్యాయనంతోనే అన్ని శాస్త్రాలపై అవగాహన ఏర్పడుతుందని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ యూనివర్సిటీ వీసీ కేఆర్ రజని అన్నారు. వర్సిటీలో గురువారం నిర్వహించిన ప్రపంచతత్వ శాస్త్ర దినోత్సవంలో ఆమె పాల్గొని మాట్లాడారు. మానవ విలువలు, సామాజిక నైతికత దిగజారుతున్నప్పుడు తత్వశాస్త్రం అవసరమన్నారు. వర్సిటీ రెక్టార్ బి.అడ్డయ్య, ప్రత్యే కాధికారి కె.సామ్రాజ్యలక్ష్మి, వర్సిటీ ప్రిన్సిపాల్స్ తదితరులు అన్నారు.

అటవీ జీవులపై అప్రమత్తంగా ఉండాలి: డీఆర్వో

హరిపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):అటవీ ప్రాంతం, వన్య ప్రాణులపై ప్రతి ఒక్కరూ అప్రమత్తంగా ఉండాలని మందస డీఆర్వో రాము కోరారు.మందస మండలంలోని బుడంబో, బిడిమి గ్రామాల్లో అవగాహన సదస్సులు నిర్వహించారు. కార్యక్రమంలో ఎస్ఎస్‌వో పోలయ్య, లక్ష్మణమూర్తి, వెంకటేష్, దుర్గాదేవి పాల్గొన్నారు.

ఫాసిజాన్ని తక్షణమే అడ్డుకోవాలి

వజ్రపుకొత్తూరు, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): దేశం పాసిస్ట్ ప్రమాదం ఎదుర్కొంటోందని, తక్షణమ ఏ ఫాసిజాన్ని అడ్డుకోవాలని సీపీఎంఎల్ న్యూడెమొక్రసీ జిల్లా కార్యదర్శి వంకల మాధవరావు పిలుపునిచ్చారు. గురువారం మర్రిపాడు అమరవీరుల స్థూపం వద్ద అమవీరుల 46వ సభను నిర్వహించారు.

అపార్ నమోదు వేగవంతం చేయాలి

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): అపార్ నమోదులో అలసత్వం విడనాడి వేగవంతం చేసేందుకు ప్రైవేటు పాఠశాలలు యాజమాన్యం శ్రద్ధ చూపించాలని బీసీ సంక్షేమశాఖ అధికారి, మండల ప్రత్యేకాధికారి అనురాధ కోరారు. గురువారం పట్టణంలో పలు కళాశాలలో ఆధార్ కేంద్రాలను పరిశీలించారు. ఈసందర్భంగా విద్యార్థుల అపార్ పూర్తి చేయాల్సిన బాధ్యత పాఠశాల, కళాశాలల యాజమాన్యలదేనని తెలిపారు.కార్యక్రమంలో ఎంఈవో ఉప్పాడ శాంతారావుపాల్గొన్నారు.

●పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పాతపట్నంలోని సెయింట్ ఆన్స్ స్కూల్‌లో ఏర్పాటుచేసిన ఆధార్ కేంద్రంలో ఆన్‌లైన్‌నమోదు కార్యక్రమాన్ని మండల ప్రత్యేకాధికారి మంచు కరుణాకరరావు, ఎంపీడీవో పి.చంద్రకుమారి పరిశీలించారు. ఈసందర్భంగా కరుణాకరరావు మాట్లాడుతూ మండలంలో 12,707 విద్యార్థులకు గాను 9017 మందికి అపార్ ఐడీలు క్రియేట్ చేసినట్లు తెలిపారు

ఆదివాసీలకు క్షమాపణ చెప్పాలి

జలుమూరు, నవంబరు 21:(ఆంధ్రజ్యోతి) ఎమ్మెల్సీ నర్తు రామారావు శాసన మండలిలో అవగాహన లేకుండా మాట్లాడి ఆదివాసీల మనోభావాలు దెబ్బతీసేలా వ్యవహరించడంతో బహిరంగ క్షమాపణ చెప్పాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వాబ యోగి డిమాండ్‌చేశారు. గురువారం సారవకోటలో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ జిల్లాలో గల బెంతుఒరియాలకు గిరిజనులుగా గుర్తించాలని మాట్లాడడం తగదని, విషయం తెలుసుకోకుండా అవగాహన రాహిత్యంగా మాట్లాడడం సిగ్గుచేటన్నారు. కార్యక్రమంలో ఆదివాసీ సంక్షేమ పరిషత్ సభ్యులు జన్ని దాలయ్య, బొమ్మాళి కృష్ణ, బాలరాజు, నాగయ్య, రంగారావు పాల్గొన్నారు.

హోమియో వైద్యంపై ఆశా కార్యకర్తలకు శిక్షణ

పాతపట్నం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): గంగువాడ పీహెచ్‌సీలోఆశా కార్యకర్తలకు జాతీయ ఆయుష్ మిషన్‌లో భాగంగా హోమియోవైద్యం, యోగాభ్యాసాలపై గురువారం శిక్షణ నిర్వహించారు. పీహెచ్‌సీ వైద్యాధికారి శివ పర్యవేక్షణలో జరిగిన కార్యక్రమంలో హోమియోవైద్యురాలు ఉమాగౌరి, మహేశ్,పూర్ణిమ డి.దివ్య పాల్గొన్నారు.

పనిచేసిన కార్యకర్తలకు గుర్తింపు: కలమట

మెళియాపుట్టి/కొత్తూరు, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కష్టకాలంలో పనిచేసిన ప్రతి కార్యకర్తకు గుర్తింపు ఉంటుందని టీడీపీ జిల్లా అధ్యక్షుడు కలమట వెంకటరమణమూర్తి తెలిపారు. మెళియాపుట్టి టీడీపీ మండలాధ్యక్షుడు భాస్కర్‌గౌడ్ గౌడ కార్పొరేషన్ డైరెక్టర్‌గా నియమితులయ్యారు. దీంతో కొత్తూరు మండలంలోని మాతలలో కలమట వెంకటరమణ భాస్కర్‌గౌడ్‌ను సన్మానించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు వసంత్, శ్రీను, పరమేస్‌రెడ్డి, శాంతరావు, పోలినాయుడు,, దనంజయ్, శంకర్ పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో సత్యసాయి వ్రతాలు

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): స్థానిక బొడ్డవలస సత్యసాయి మందిరంలో భగవాన్ సత్యసాయిబాబా జయంతి పురస్కరించుకుని గురువారం సామూహిక సత్యసాయి వ్రతాలు నిర్వహించారు.కార్యక్రమంలో కన్వీనర్ నాగేశ్వరరావు పాల్గొన్నారు.

తీర ప్రాంతంలో కార్డెన్ సెర్చ్

హరిపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి):మందస మండలంలోని తీరప్రాంతంలో హెచ్‌సీ శేఖర్ ఆధ్వర్యంలో పోలీసులు కార్డెన్ సెర్చ్ నిర్వహించారు. కొర్రాయిగేటు,హరిపురం, అంబుగాం, లోహ రిబంద తదితర తీరప్రాంతాలనుంచి వచ్చే రహదారుల్లో తనిఖీలు నిర్వహించారు. అపరిచిత వ్యక్తులు, అనుమానితులు కనిపిస్తే వెంటనే సమాచారం అందించాలని కోరారు. కార్యక్రమంలో మందస పోలీసులు ఢిల్లేశ్వరరావు, లక్ష్మణ్ పాల్గొన్నారు.

24, 25 తేదీల్లో యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు

హరిపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): యూటీఎఫ్ స్వర్ణోత్సవాలు విజయవంతంచేయాలని సంఘ జిల్లా ప్రతినిధి గుంట కోదండరావు కోరారు.ఈమేరకు గురువారం హరిపురంలో ఈనెల 24, 25 తేదీల్లో జరిగే స్వర్ణోత్సవాలు గోడపత్రికలనుడీఈవో తిరుమల చైతన్య ఆవిష్కరించారు. కార్యక్రమంలో జగదీష్, ఈశ్వరరావు, తులసీరావు, చక్రధర్, రాజారావు పాల్గొన్నారు.

క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలపై అవగాహన

నరసన్నపేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): ప్రతి ఇంటా 16 ఏళ్లు నిండిన వారికి వైద్యఆరోగ్య సిబ్బంది క్యాన్సర్ స్క్రీనింగ్ పరీక్షలను నిర్వహించాలని డీఎంహెచ్‌వో బి. మీనాక్షి సూచించారు. గురువారం ఉర్లాం పీహెచ్‌సీలో వైద్యఆరోగ్యశాఖ సిబ్బందితో క్యాన్సర్ స్కీనింగ్ పరీక్షలపై అవగాహన నిర్వహించారు. కార్యక్రమంలో ఉర్లాం పీహెచ్‌సీ వైద్యులు జి. సుజాత, అరవింద్ పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణపై అవగాహన

టెక్కలి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): సీతాపురంలో సంకల్పం కార్యక్రమంలో భాగంగా గురువారం రాత్రి గ్రామస్థులకు సీఐ ఎ.విజయ్‌కుమార్ రోడ్డు ప్రమాదాల నివారణ, సైబర్‌క్రైమ్, యాంటీడ్రగ్స్‌పై అవగాహన కల్పించారు. మహిళలు భద్రతలు పాటించడం ద్వారా నేరాలు తగ్గించవచ్చని తెలిపారు.

లక్ష్యాన్ని నిర్దేశించుకోవాలి

హరిపురం, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ప్రతిఒకరూ ఒక లక్ష్యాన్ని నిర్దేశించుకుని, దాని సాధించేందుకు కృషిచేయాలని కాశీబుగ్గ రూరల్ సీఐ తిరుపతిరావు పిలుపునిచ్చారు. గురువాం మందస మండలంలోని హరిపురం-బాలిగాం కూడలిలో కళాశాల విద్యార్థులతో సంకల్పంకార్యక్రమంలో భాగంగా అవగాహన ర్యాలీ చేపట్టారు. కార్యక్రమంలో ఆయనతోపాటు మందస పోలీసులు పాల్గొన్నారు.

●ఎల్.ఎన్.పేట, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): లక్ష్మీనర్సుపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో మత్తు పదార్థాల వాడకం వల్ల కలిగే అనర్థాలు, నష్టాలపై విద్యార్థులకు సరుబుజ్జిలి స్టేషన్ హెచ్‌సీ తిరుపతిరావు అవగాహన కలిగించారు. కార్యక్రమంలో పాఠశాల కానిస్టేబుల్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

మందస,నవంబరు21(ఆంధ్రజ్యోతి): మండలంలోని 11 కేవీ బొగాబంద ఫీడర్‌లో లైన్ మరమ్మతుల దృష్ట్యా శుక్రవారం ఉదయం తొమ్మిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకూ కిల్లోయ, బొగాబందల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని పలాస ట్రాన్స్‌కో ఈఈ జి.యగేశ్వరరావు తెలిపారు.

●నందిగాం, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): కొత్తగ్రహారం సబ్‌స్టేషన్ పరిధిలోగల కొత్తగ్రహారం, దేవుపురం ఫీడర్లలోని మజ్జిగోపాలపురం,సింగుపురం, లట్టిగాం,కంచిపూరు, పెద్దలవునిపల్లి, కాపుతెంబూరుతోపాటు పరిశ్రమలకు శుక్రవారంఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం రెండు గంటల వరకు విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ట్రాన్స్‌కో టెక్కలి ఈఈ శంకరరావు తెలిపారు. మరమ్మతులు, జంగిల్‌తొలగింపు దృష్ట్యా వినియోగదారులు సహకరించాలని కోరారు.

నేడు మెగా వైద్య శిబిరం

హరిపురం, నవంబరు21 (ఆంధ్రజ్యోతి): మందస మండలంలోని పొత్తంగి సిరిపురం ఉన్నతపాఠశాలఆవరణలో శుక్రవారం వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు గాయత్రి చారిటబుల్ ట్రస్ట్ ఛైర్మన్ కొర్ల కన్నారావు తెలిపారు. జెమ్స్ వైద్యులు గుండెతో పాటు బీపీ, షుగర్, కాలేయ వ్యాధులకు పరీక్షలు జరిపి మందులు అందజేయనున్నట్లు పేర్కొన్నారు.

నేడు కృష్ణమూర్తి వర్ధంతి

టెక్కలి, నవంబరు 21(ఆంధ్రజ్యోతి): పీడిత ప్రజల పక్షాన పోరాటం చేసిన సీపీఎం నాయకుడు కామ్రేడ్ పినకాన కృష్ణమూర్తి వర్ధంతిని ఆపార్టీ నాయకులు చిన్నలక్ష్మీపురం జంక్షన్‌లోని స్థూపం వద్ద శుక్రవారం నిర్వహించనున్నారు.సీపీఎంజిల్లా కార్యవర్గసభ్యుడు భవిరి కృష్ణమూర్తి తదితరులు స్థూపం వద్ద నివాళులర్పించనున్నారు.

29న చలో శ్రీకాకుళం

కోటబొమ్మాళి, నవంబరు 21 (ఆంధ్రజ్యోతి): ఎస్సీ రిజర్వేషన్లు, దాడులకు నిరసనగా ఈనెల 29న నిర్వహించే చలోశ్రీకాకుళం సభ, ర్యాలీని జయప్రదం చేయాలని ఎస్సీ రిజర్వేషన్లవ్యతిరేక పోరాటసంఘం సభ్యుడు సామ సంజీవరావు కోరారు. కోటబొమ్మాళిలో సభ గోడపత్రికను విడుదల చేశారు.